

ఇటుక బట్టీ.. బురిడీ

ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండానే ఖేడ్ డివిజన్‌లో ఇటుకబట్టీలు కొనసాగుతున్నాయి. నిబంధనలను పూర్తిగా తోసిరాజని బట్టీలు ఏర్పాటు చేశారు. 8లో



అనుమానంతోనే హతమార్చాడు

తనతో పాటు మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందేమోనన్న అనుమానంతో ఓ వ్యక్తి వివాహితను హత్య చేశాడు. ఈ ఘటన ఐడీఏ బొల్లారంలో చోటుచేసుకుంది. 8లో



కిటకిటలాడిన శివాలయాలు

మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. శనివారం తెల్లవారు జామున నుంచే మహాదేవుడికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. 9లో

కేతకిలో భక్తజన సందడి

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- మారుమోగిన శివనామ స్మరణ
- భారీగా తరలివచ్చిన భక్తజనం

ఝరాసంగం(జహీరాబాద్): ఓం నమఃశివాయ.. అంటూ కేతకి సంగమేశ్వర ఆలయం శివనామస్మరణతో మారుమోగింది. శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఝరాసంగం కేతకి ఆలయానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పోటెత్తారు. ఆలయంలో గణపతి హోమం, రుత్వికరణ హోమం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయ ఆవరణలో అమృత గుండంలో పుణ్య స్నానాలు చేసి జల లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రాతకాల పూజ అనంతరం గర్భగుడిలో పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని బలభీముడి, నాగేంద్రుడి, బసవణ్ణమందిరం, పోగడ చెట్టు, నవగ్రహాలు తదితర ఆలయాల వద్ద పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో అదృష్ట లింగాన్ని ఎత్తి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. శివదీక్ష చేపట్టిన భక్తులు ఇరుముడి చెల్లించుకుని దీక్షవిరమణ చేశారు.

ఎంపీ, ఎమ్మెల్యేల పూజలు

జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, జహీరాబాద్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, డీసీఎంస్ చైర్మన్ ఎం.శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఉమ్మడి మెదక్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌లు సునితా, రాజమణి మురళీయాదవ్, కాంగ్రెస్ నాయకుడు హన్మంత్‌రావుపాటిల్, సర్పంచ్ జగదీశ్వర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్‌పాటిల్, సంతోష్‌కుమార్, నర్సింలు, సంగమేశ్వర్, నామ రవికిరణ్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జహీరాబాద్ డీఎస్పీ రఘు, ఆలయ ఈఓ శశిధర్, పాలక మండలి చైర్మన్ నీల వెంకటేశం చర్యలు తీసుకున్నారు.



ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం



కేతకిలో అమ్మవారికి ఎంపీ బీబీ పాటిల్ పూజలు



అమ్మవారి సన్నిధిలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, తదితరులు



పూజలు చేస్తున్న సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

ఆకట్టుకున్న సైకత శివలింగం



సైకత శివలింగం వద్ద పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, సునితాలక్ష్మారెడ్డి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: శివరాత్రి వేడుకల పురస్కరించుకొని సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామంలో శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 19.5 అడుగుల సైకత శివలింగానికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో 3,500 టన్నుల శివలింగానికి పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన సైకత లింగేశ్వర అర్చన చేస్తే పాపాలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, కలెక్టర్ శరత్ పూజలు చేశారు. ఎస్పీ రమణ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ పాల్గొన్నారు.



పూజలకు హాజరైన భక్తులు

న్యూస్‌రీల్

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కమిషనర్ విజయ్‌కుమార్

నారాయణఖేడ్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ విజయ్ కుమార్ అన్నారు. శనివారం ఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రోగుల వార్డులను పరిశీలించి, ఆస్పత్రిలో అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. మందులను, హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, నెలకొన్న సమస్యలపై సూపరింటెండెంట్ వెంకటలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఏడుపాయలకు ప్రత్యేక బస్సులు

జహీరాబాద్ టౌన్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జహీరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి ఏడుపాయల, ఝరాసంగం కేతకి సంగమేశ్వర ఆలయాలకు శనివారం ప్రత్యేక బస్సులను నడిపారు. ఏడుపాయలకు వెళ్లే భక్తుల కోసం డిపో లోపల ప్రత్యేంగా టెంట్‌లు వేసి, భక్తుల రద్దీకి అనుగుణంగా సర్వీస్‌లను ఏర్పాటు చేశారు. డిపో బయట నుంచి ఝరాసంగం శ్రీకేతకి సంగమేశ్వర ఆలయానికి బస్సులను నడిపారు. ఏడుపాయల జాతరకు వెళ్లే పెద్దలకు రూ.180, పిల్లలకు రూ.100 చార్జీని వసూలు చేశారు. ఝరాసంగానికి పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20 చార్జీలను తీసుకున్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎంపీ



కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం రాత్రి ప్రగతి భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గం అభివృద్ధిపై మాట్లాడినట్లు తెలిపారు.

రేపు దత్తగిరికి బండి సంజయ్

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలోని ఆధ్యాత్మిక క్షేత్రం బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమానికి సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రానున్నట్లు ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, డా.సిద్ధేశ్వర్ స్వామి తెలిపారు. ఆశ్రమంలో నిర్వహించే దత్తగిరి మహారాజ్ శత జయంతి మహోత్సవాల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

బసవేశ్వరతో కోనసీమగా ఖేడ్

- మంత్రి హరీశ్‌రావు
- బోరంచలో ఎత్తిపోతల పనులకు భూమిపూజ



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



భూమిపూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతి కిరణ్, తదితరులు

మనూరు(నారాయణఖేడ్): బసవేశ్వర ఎత్తిపోతల పథకంతో నారాయణఖేడ్ ప్రాంతం మరో కోనసీమగా మారుతుందని ఆర్థిక, వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆకాంక్షించారు. శనివారం బోరంచలో ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీతో కలిసి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కాళేశ్వరం నుంచి మల్లన్నసాగర్ మీదుగా మేడిగడ్డ, సింగూరుకు తరలించి, గోదావరి, మంజీరాను కలిపి ఖేడ్ పరిధిలోని బసవేశ్వర ఎత్తిపోతల ద్వారా 231 చెరువులు నింపుతామన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో 1.31లక్షల ఆయకట్టుకు, అందోల్ నియోజకవర్గంలోని 36వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అందోల్ నియోజకవర్గంలో నాలుగు ప్రాజెక్టుల ద్వారా 2.26లక్షల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని, సంగమేశ్వర ఎత్తిపోతల ద్వారా జహీరాబాద్ పరిధిలో 1.31లక్షల ఎకరాలు, సంగారెడ్డి నియోజకవర్గంలో 84,827 ఎకరాలు, పటాన్‌చెరులో 25,350 ఎకరాలు, మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో 80,935 ఎకరాలు, మెదక్ నియోజకర్గంలో 13,830 ఎకరాలు, కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో 1,622 ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు.

ఖేడ్ దశ తిరిగింది

దశాబ్దాల కాలంగా వెనుకబడిన ఖేడ్ ప్రాంతం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గెలుపుతో దశ తిరిగి సిరి అందుకుందని మంత్రి అన్నారు. మూడు కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, మార్కెట్ యార్డు, గోదాంలు, మోడల్ డిగ్రీ కళాశాల, ఏరియా ఆస్పత్రి, ప్రతీ మండలానికి గిరిజన, మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చొరవతో ఖేడ్‌లో వలసలు తగ్గి, అభివృద్ధి బాటలో పయనిస్తుందని కొనియాడారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ రేగోడ్, వట్‌పల్లి పరిధిలో బసవేశ్వర ఆయకట్టు పరిధిని పెంచాలని మంత్రిని కోరారు. అనంతరం కరస్‌గుత్తిలో రూ.6కోట్లతో నిర్మించిన 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన బోరంచ నల్లపోచమ్మ ఆలయానికి చేరుకొని, అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి బంగారు ముక్కుపుడుక చేయిస్తానని మొక్కుకున్నారు. అనంతరం మనూర్ మండల కేంద్రంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్, ఎస్పీ రమణ్‌కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సీడీఏ చైర్మన్ శివకుమార్, ఖేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సువర్ణ శెట్కార్, జెడ్పీటీసీలు పుష్పాబాయిమోహన్‌రావు, రాజురాథోడ్, ఎంపీపీలు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, రవీందర్ నాయక్, రమేశ్‌చౌహన్, సర్పంచ్ రేణుక పండరి, ఇరిగేషన్ ఇంజినీర్‌లు అజయ్, మురళీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి పథంలోకి..

ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావు



జగన్నాథ్‌పూర్ శివారులో చెరువు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

నారాయణఖేడ్: బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే నారాయణఖేడ్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ శివారులో రూ.2.14కోట్లతో నిర్మించనున్న చెరువు పనులకు, రూ.6.26కోట్లతో నిర్మించనున్న డబుల్‌బెడ్‌రూం పనులకు శనివారం ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతికిరణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సరిహద్దులో ఉన్న కర్ణాటక ప్రజలు ఆకర్శితులు అవుతున్నారన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇచ్చి డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతికిరణ్, కలెక్టర్ శరత్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, ఎంపీపీ చాందీబాయి, జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, సర్పంచ్ పోచమ్మ, జైపాల్ రెడ్డి, చెన్‌బసప్ప, రాజునాయక్ పాల్గొన్నారు.

శనీశ్వరునికి తిల తైలం.. రుద్రునికి అభిషేకం



సామూహిక తైలాభిషేక పూజలో భక్తులు

1,500 సామూహిక తైలాభిషేకాలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ శంభునిగిరి భక్తులతో పోటెత్తింది. శనివారం శనిత్రయోదశి మహోత్సవం, మహాశివరాత్రి పర్వదినం ఒకేరోజు కలిసిరావడంతో కొండపైన ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. శనిదోష నివారణ కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మండపంలో బారులు తీరి శనీశ్వరుని మూల విగ్రహానికి తైలాభిషేకం చేశారు. అనంతరం కొండమీద శ్రీవిద్యా సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శనీశ్వరునికి 1,500 తైలాభిషేకాలు జరిగాయని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి తెలిపారు.

రుద్రునికి అభిషేకం..

శివనామ స్మరణతో వర్గల్ శంభులింగేశ్వరుని సన్నిధానం శోభిల్లింది. మహా శివరాత్రి పర్వదిన వేళ పరమశివునికి అభిషేకాలు, అర్చనలతో భక్తి భావనలు వెల్లివిరిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు శివలింగార్చన జరిపి తరించారు. తున్కిఖాల్సా, గౌరారం, పాములపర్తి తదితర ఆలయాల్లో మహా శివరాత్రి పర్వదిన వేడుకల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు కొనసాగాయి.



మంగళహారతి సమర్పిస్తున్న అర్చకులు

దుర్గమ్మా.. దీవించమ్మా

- వైభవంగా ప్రారంభమైన ఏడుపాయల జాతర
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి హరీశ్‌రావు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



ఏడుపాయల ఆలయం వద్ద భక్తుల సందడి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతర శనివారం కనుల పండువగా ప్రారంభమైంది. ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వం తరపున దుర్గమ్మ తల్లికి పట్టువస్త్రాలు సమర్పించారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, కలెక్టర్ రాజర్షిషా దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంజీరానదిలో ఏర్పాటు చేసిన శివుని ప్రతిమకు పూజలు చేసి జాతరను ప్రారంభించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు జరిగే జాతర తొలిరోజు శివదీక్షలతో ప్రారంభమైంది. కొండగుహలో వెలసిన దుర్గమ్మ తల్లిని అందంగా అలంకరించారు. శివదీక్షలు చేపట్టారు. కొంతమంది భక్తులు అమ్మవారికి బోనాలు, ఒడిబియ్యం, తలనీలాలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రంతా భక్తులు శివరాత్రి జాగరణ చేశారు. కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ఆలయ చైర్మన్ బాలాగౌడ్ పూజలు చేశారు.

భారీ ఏర్పాట్లు

ఏడుపాయల జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ టేకులగడ్డ నుంచి ఆలయం వరకు ఉచిత బస్సు సర్వీస్ నడుపుతోంది. పారిశుధ్య కార్మికులు చెత్తా చెదారం లేకుండా ఏడుపాయల వీధులను అద్దంలా తీర్చిదిద్దుతున్నారు. 700 మంది పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా బందోబస్తు నిర్వహిస్తుండగా.. ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని పర్యవేక్షించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భక్తులకు తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులు స్నానాలు చేసేందుకు మంజీరా పాయల్లో, షవర్లు ఏర్పాట్లు చేశారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

నేడు బండ్ల ఊరేగింపు

ఏడుపాయల జాతరలో అత్యంత ప్రధాన ఘట్టమైన బండ్ల ఊరేగింపు ఆదివారం సాయంత్రం జరగనుంది. జానపద సంస్కృతిలో జరిగే ఈ వేడుకను తిలకించేందుకు లక్షలాది భక్తులు తరలిరానున్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా .. పలువురికి గాయాలు


పొలంలో బోల్తాపడిన ఆటో

శివ్వంపేట(నర్సాపూర్): అదుపు తప్పి ఆటో బోల్తా పడిన సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. చిన్నగొట్టిముక్కల- జీడిపల్లి ప్రధాన రహదారిపై గోమారం శివారు బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. ఆటో ప్రమాదంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు.

కార్మికుడి మృతి


మాణిక్ సింగ్ మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): ఓ పరిశ్రమలో పని చేసే కార్మికుడు నిద్రలోనే మృతి చెందాడు. పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికుడు మాణిక్ సింగ్(25) సంవత్సరం క్రితం జీవనోపాధికి మండలంలోని ముప్పిరెడ్డిపల్లికి వచ్చాడు. స్థానిక లార్విన్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే గదిలో నిద్రపోయాడు. శనివారం ఉదయం నిద్ర లేవకపోవడంతో తోటి కార్మికులు లేపగా, అప్పటికే చనిపోయిఉన్నాడు. కుటంబసభ్యులకు సమాచారమిచ్చి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎస్ఐ సందీప్‌రెడ్డిని వివరణ కోరగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి చెందాడు. ఈ ప్రమాదం రాజీవ్ రహదారిపై గౌరాయిపల్లి స్టేజీ వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొముురవెల్లి గ్రామానికి చెందిన జంపాల కరణ్(20) సిద్దిపేటలో పరీక్షలు రాయడానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరుగు ప్రయాణంలో గౌరాయిపల్లి స్టేజీ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇటుక బట్టీ.. బురిడీ

పలు శాఖల అనుమతులు లేకుండానే నిర్వహణ

- భారీగా చెరువుమట్టి తవ్వకం, కలప నరికివేత
- చోద్యం చూస్తున్న అధికార గణం
- వెట్టి మధ్య నలుగుతున్న కూలీలు
- వేధింపుల ఘటనతో వెలుగులోకి వస్తున్న వాస్తవాలు


ఇటుకలు కాల్చేందుకు వినియోగిస్తున్న కలప ఇదే


ఇటుకల తయారీకి చెరువు నుంచి తీసుకువచ్చిన మట్టి

నారాయణఖేడ్: ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండానే ఖేడ్ డివిజన్‌లో ఇటుకబట్టీలు కొనసాగుతున్నాయి. నిబంధనలను పూర్తిగా తోసిరాజని బట్టీలు ఏర్పాటు చేశారు. ఇక్కడ నిర్వహణ ఓ మాఫియాగా తయారైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజాంపేట్ మండలంలోని దర్గాతండా సమీపంలోని శ్రీరాంబ్రిక్స్ ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న కూలీలు, బాలికలు, బాల కార్మికులకు వేధింపుల ఘటనతో బట్టీల అక్రమాలు ఒకొక్కటిగా బయట పడుతున్నాయి. ఆయాశాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో బట్టీల దందా యథేచ్ఛగా సాగుతోంది.

- దర్గాతండా సమీపంలోని బట్టీలను పరిశీలిస్తే అక్రమ నిర్వహణ తేటతెల్లమైంది. భారీ విస్తీర్ణంలో బట్టీలు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఇక్కడ వీటి నిర్వహణ సాగుతున్నా అధికారులకు తెలియకపోవడం అనుమానాలకు తావిస్తోంది. స్థానికులకు అధికంగా కూలీ చెల్లించాల్సి వస్తుందని, సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందన్న ఉద్దేశంతో ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలను ఏజెంట్ల ద్వారా తీసుకొస్తున్నారు. ఇక్కడకు వచ్చిన వారికి సరైన కూలీ చెల్లించకపోగా వేధింపులకు గురిచేస్తున్నారు. కనీస సదుపాయాలు కూడా కల్పించడంలేదని ఒడిశాకు చెందిన బాధిత కూలీలు వాపోయారు. ఈ బట్టీవద్ద 70మంది కూలీల బస ఏర్పాట్లు చూస్తే అధ్వానంగా ఉన్నాయి. కనీస సదుపాయాలు, విద్యుత్, తాగునీరు, మహిళలకు ప్రత్యేక స్నానాల గదులు, మరుగుదొడ్లు ఏమీలేవు. పశువుల పాకల తరహాలో వారి నివాస ఏర్పాట్లు ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

- దర్గా తండా వద్ద ఉన్న బట్టీలకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారు. బట్టీల నిర్వహణకు వ్యవసాయ భూమిని వ్యవసాయేతరంగా మార్చాలి. బట్టి ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి. బట్టీలకు వాడే మట్టిని అక్రమంగా చెరువుల్లోంచి తోడుకొని తెచ్చి బట్టీల వద్ద నిల్వ ఉంచారు. కొన్ని వేల ట్రిప్పుల మట్టిని తోడి బట్టీల వద్ద పెద్ద చెరువు కట్ట తరహాలో వేశారు. చెరువులో మట్టి నిబంధనల మేరకు ఒక అడుగు నుంచి మూడు అడుగుల లోపే తోడాలి. అంతకంటే ఎక్కువ లోతు తోడితే చెరువు కట్టకు ప్రమాదం ఏర్పడుతుంది.
- ఏడాది కాలంగా ప్రభుత్వం చెరువుల్లోంచి మట్టిని తోడేందుకు అనుమతులు ఇవ్వడంలేదు. మట్టి తీయాలంటే ప్రభుత్వం, కలెక్టర్ ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ ఈ బట్టీల వద్ద వేలాది ట్రిప్పులు మట్టి దిబ్బలు ఉండటం చూస్తే ఎన్ని చెరువుల్లోంచి ఎన్ని అడుగుల మేర మట్టిని తవ్వారు? ఆ చెరువుల కట్టల పరిస్థితి ఏమిటన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.
- లైట్ వెయిట్ ఇటుకకు చెరువు మట్టి, బూడిదను కలిపి వాడుతారు. దీనికి తోడు వ్యవసాయానికి ఉన్న ఉచిత కరెంటును బట్టీల నిర్వహణకు, బోరు నీటి వాడకానికి వాడుతున్నారు. మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల నుంచి అనుమతులు లేకుండానే అన్ని ఇటుకబట్టీలు సాగుతున్నాయి.
- స్థానిక సంస్థలు, ప్రభుత్వానికి ఎలాంటి వ్యాపార, ఆదాయ పన్ను చెల్లించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటుకలను కాల్చేందుకు భారీగా చెట్లను నరికి బట్టీలకు వినియోగిస్తున్నా అటవీఅధికారులు అడ్డుకోవడంలేదు. బాల కార్మికులు పనులు చేస్తున్నా తనిఖీలే లేవు.
- నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో 30 వరకు ఇటుక బట్టీలు ఉన్నా, చాలాబటీట్లకు ఎలాంటి అనుమతులు లేకుండానే సాగుతున్నాయి. ఈ బట్టీలపై అధికారులు తనిఖీలు, దాడులు నిర్వహిస్తే నివ్వెరపోయే నిజాలు బయటపడతాయి. వెట్టిలో మగ్గుతున్న కార్మికులకు విముక్తి కలుగుతుంది.

నిర్వహణకు అనుమతి లేదు

దర్గా తండా వద్ద ఉన్న ఇటుకబట్టీలకు ఎలాంటి అనుమతులు లేవు. మైనింగ్, రెవెన్యూతోపాటు ఆయా శాఖల అనుమతులు ఉండాలి. వివరాలు సమర్పించాలని బట్టీల నిర్వాహకులకు ఆదేశించాం. అనుమతులు లేకుంటే చర్యలు తీసుకుంటాం. నిజాంపేట్ మండలంలో ఎన్ని బట్టీలు కొనసాగుతున్నాయనే విషయాలపై విచారణకు ఆర్ఐకి ఆదేశించాను.

– మదన్, తహసీల్దార్, నిజాంపేట్

చైన్ స్నాచర్లు అరెస్ట్.. రిమాండ్

మియాపూర్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు తెంచుకెళ్లిన ఇద్దరిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి 4 తులాల బంగారం, ఓ పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మియాపూర్ ఏసీపీ పి.నర్సింహారావు కేసు వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా కొత్తవాడ పద్మానగర్‌కు చెందిన వేణువంక సురేష్(23), అతని సోదరుడైన వడ్లూరి నిఖిల్(21) మియాపూర్‌లోని న్యూ హాఫీజ్‌పేటలోని మార్తాండనగర్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. డబ్బులు చాలకపోవడం, మద్యం, చెడు వ్యసనాలకు అలవాటు పడడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనానికి పాల్పడ్డారు. ఇరువురు మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృషినగర్‌లో ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో బైక్‌పై వచ్చి మహిళ మెడలోంచి బంగారు మంగళసూత్రం దొంగిలించి పారిపోయారు .మియాపూర్ పోలీస్‌లు, మాదాపూర్ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా న్యూహాఫీజ్‌పేట మార్తాండ నగర్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా అటువైపు వచ్చిన సురేష్, నిఖిల్‌లను అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. దీంతో మియాపూర్ పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. కేసు ఛేదించిన మియాపూర్ సీఐ తిరుపతిరావు, డీఐ కాంతారెడ్డి, ఎస్ఐ జగదీశ్వర్, సీసీఎస్ మాదాపూర్ ఎస్ఐ పరుశురాం, ఏఎస్ఐ కిషన్, కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాష్, అశోక్‌లకు ఏసీపీ అభినందించారు.

అనుమానంతోనే హతమార్చాడు


బొల్లారంలో హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భీంరెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): తనతో కాకుండా మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందేమోనన్న అనుమానంతో ఓ వ్యక్తి వివాహితను హత్య చేశాడు. అయితే మొదట వివాహిత అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఇది హత్యేనని పోలీసులు తేల్చారు. ఈ ఘటన జిన్నారం మండలం ఐడీఏ బొల్లారంలో జరిగింది. శనివారం పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి బొల్లారంలో ఆ వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన మాసిరెడ్డి జ్యోతి(25) ఆమె భర్త రామకృష్ణారెడ్డితో బొల్లారంలోని వెంకట్‌రెడ్డినగర్‌లో నివాసముంటోంది. కుంటి బాలచందర్ ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్త లేని సమయంలో తరచు జ్యోతిని కలిసేవాడు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన జాతర జ్యోతి దంపతులిద్దరూ వెళ్లారు. భర్త అక్కడే ఉండగా, జ్యోతి వెంకట్‌రెడ్డినగర్‌కు వచ్చింది. ఈ నెల 13వ తేదీన ఆమెను కలిసేందుకు బాలచందర్ ఇంటికి వచ్చాడు. ఈ సమయంలో ఆమె మరొకరితో ఫోన్‌లో మాట్లాడుతోంది. మరొకరితో సంబంధం పెట్టుకున్నావా అంటూ ఆమెను నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. జ్యోతి బాలచందర్ చెంపపై కొట్టి, ఆయన కుటుంబసభ్యులను దూషించింది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. 14వ తేదీన జ్యోతి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో ఆమె తలపై చిన్న గ్యాస్ సిలిండర్‌తో కొట్టి, గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక తలుపులు పెట్టి తాళం వేశాడు. తాళం చెవిని తనవద్దే ఉంచుకుని జ్యోతి సెల్‌ఫోన్‌ను నాలాలో విసిరేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు దృశ్యం సినిమాను అనుకరిస్తూ, తిరుపతి వెళ్లి గుండు గీయించుకున్నాడు. ఏమీ తెలియనట్టుగా తాను నివాసముంటే మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మీగూడలోని అద్దె ఇంటికి చేరుకున్నాడు. జ్యోతి కాల్ డేటా, సీసీ పుటేజీ ఆధారంగా బాలచందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, అసలు విషయం బయటపడింది. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను డీఎస్పీ భీంరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ వేణుకుమార్, ఎస్ఐ విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని ఇస్నాపూర్‌కు చెందిన మాణమ్మ రెండో కూతురు మాధురి(19) ఇంటర్ చదివి ఇంటి వద్ద ఉంటోంది. శనివారం మాణమ్మ డ్యూటీకి వెళ్లగా, ఇంట్లో ఉన్న మాధురి చీరతో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న మాణమ్మ మరిది జగన్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన తల్లికి ఇంటికి వచ్చింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి తల్లి మాణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆత్మహత్య చేసుకోవడానికి ముందు మాధురి పవన్‌కు వీడియో కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పింది. వెంటనే పవన్ స్నేహితులు మాధురి ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఆమె ఆత్మహత్యకు పాల్పడింది.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శేరిలింగంపల్లి: పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి (50) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. తెల్లరంగు గళ్ళ షర్టు వేసుకున్నాడు. ఎడమ చేయిపై సరస్వతి అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. లోకో పైలెట్ సమాచారంతో నాంపల్లి జీఆర్‌పీ పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

బంగారం దొంగతనం కేసులో ఇద్దరి రిమాండ్

- పరారీలో మరో ఇద్దరు నిందితులు
- 100 గ్రాముల బంగారం స్వాధీనం

రామచంద్రపురం (పటాన్‌చెరు): బంగారం దొంగతనం కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్న సంఘటన రామచంద్రాపురం పరిధిలో చోటుచేసుకుంది. శనివారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ నర్సింహారావు ఆ వివరాలు వెల్లడించారు. బోరబండ శివాజీ నిలయానికి చెందిన అశోక్ కుమార్ ఈ నెల 15వ తేదీన ఎర్రగడ్డ నుంచి బీరంగూడ వరకు ఆర్టీసీ బస్సులో వచ్చాడు. బీరంగూడ రాగానే అతడి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులను సంప్రదించి జరిగిన విషయం చెప్పి, ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా శనివారం బీరంగూడ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మల్లేపల్లి అఫ్జల్ సాగర్‌కు చెందిన పూజ, సంతోష్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద ఉన్న 100 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న రాజేష్, మల్లేష్‌ను పట్టుకుంటామన్నారు. అయితే నిందితులపై రామచంద్రాపురం, చందానగర్, మియాపూర్ పోలీసు స్టేషన్ల పరిధిలో కేసులు ఉన్నట్లు గుర్తించారు. కేసులో కీలక పాత్ర పోషించిన పోలీసులను ఏసీపీ అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. బీహార్‌కు చెందిన ధీరేంద్ర కుమార్(19) మండలపరిధిలోని రుద్రారం వచ్చాడు. ఎంఎస్ఎన్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం డ్యూటీకి వెళ్లి..తిరిగి ఇంటికి వస్తుండగా హోటల్ ప్యాలెస్ ముందు రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ధీరేంద్ర కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మంచి పనులతోనే పాలకులకు గౌరవం

'కాకతీయ కాయిన్స్' పుస్తకావిష్కరణలో మంత్రి హరీశ్‌రావు

బంజారాహిల్స్: కాకతీయులు నాడు చెరువులు నిర్మిస్తే అప్పటి చెరువులకు పూర్వవైభవం తెచ్చి తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నంబరు 4లోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో కాకతీయ సామ్రాజ్య వాస్తవ పరిస్థితులు వివరించే 'కాకతీయ కాయిన్స్' పుస్తకాన్ని డాక్టర్ రాజారెడ్డి రచించగా, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు నిర్వాహకులు పాపారావుతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు.. రాజ్యాలు ఎన్ని వచ్చినా వారు చేసిన మంచి పనులే కలకాలం నిలుస్తాయని అన్నారు. చేసిన మంచి పనులను ప్రజలెప్పుడూ గుర్తుంచుకుంటారని అన్నారు. క్రీస్తు శకం 750 నుంచి 1350 వరకు పాలించిన కాకతీయులను ప్రజలు ఇప్పటికీ స్మరించుకోవడం వెనుక వారు చేసిన పనులే కారణమన్నారు. కాకతీయుల వారసత్వ సంపదను కాపాడుకున్నందుకు రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు సాధించడంలో కృషి చేసిన కాకతీయ హెరిటేజ్ ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరపున, వ్యక్తిగతంగా అవసరమైన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. డాక్టర్ రాజారెడ్డి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రిలో న్యూరో వైద్యులుగా ఎన్నో సేవలందించారని, నిమ్స్ డైరక్టర్‌గా పనిచేశారని గుర్తుచేశారు. ఒకవైపు వైద్య సేవలందిస్తూనే మరోవైపు తెలంగాణ చరిత్ర ఆధారాలతో సహా నిర్మించే గొప్ప పనిలో నిమగ్నమయ్యారన్నారు. కాకతీయులది అద్భుత పాలనని, ఆ కాలంలో ఆంధ్రదేశం సిరిసంపదలతో వెల్లివిరిసిందన్నారు. వ్యవసాయానికి ప్రత్యేక దృష్టి పెట్టి చెరువులు నిర్మించారన్నారు. ఆ తరహాలో ప్రభుత్వం సైతం మిషన్ కాకతీయ పేరుతో 476 వేలకు పైగా చెరువులకు ప్రాణం పోసి కాకతీయ రాజ్య పాలకులకు ఘనంగా నివాళులు అర్పించామన్నారు.

కోడలిని కాపాడబోయి..


బుజ్జీబాయి మృతదేహం

రేగోడ్(మెదక్): ప్రమాదంలో ఉన్న కోడలిని కాపాడబోయి ఓ అత్త మృతి చెందింది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని బురాన్‌వాడి తండాకు చెందిన బుజ్జీబాయి, గీతాబాయి అత్తాకోడలు. శనివారం కోడలు గీతాబాయి తాను ఉతికిన దుస్తులను రేకుల ఇంటికి ఆనుకొని ఉన్న ఇనుప తీగపై ఆరేయబోయింది. ఈ క్రమంలోనే ఆమెక్ షాక్ తగలగా, పక్కనే ఉన్న అత్త బుజ్జీబాయి(55) పక్కకు తోసేసే ప్రయత్నంలో విద్యుదాఘాతినికి గురై మృతి చెందింది. స్వలగాయాలతో బయటపడిన గీతాబాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే బుజ్జీబాయిని కాపాడే ప్రయత్నం చేసిన మరికొందరికి కూడా షాక్ తగిలినట్లు తండావాసులు చెబుతున్నారు. మృతురాలి భర్త మిట్టునాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లయ్య తెలిపారు.

గ్యాస్ లీకై.. మంటలు అంటుకొని..


నర్సయ్య(ఫైల్)

వర్గల్(గజ్వేల్): సిలిండర్ రెగ్యులేటర్ నుంచి గ్యాస్ లీకై మంటలు రావడంతో దుస్తులు అంటుకుని ఓ వృద్ధుడు తీవ్రగాయాలపాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం వేలూరులో ఈ నెల 11న జరిగింది. గౌరారం ఎస్సై సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వేలూరుకు చెందిన కుమ్మరి నర్సయ్య(75) భార్య ఇంట్లో వంట చేస్తున్న సమయంలో గ్యాస్‌లీకై ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో భయంతో ఆమె బయటకు పరుగెత్తింది. అదే గదిలో పడుకున్న భర్త నర్సయ్య దుస్తులకు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబీకులు అతనిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా శివరాత్రి రోజు నర్సయ్య మృతితో పండగ వేళ ఆ ఇంట విషాదం అలుముకుంది.

మద్యం మత్తులో కిందపడి


నర్సింగరావు మృతదేహం

ములుగు(గజ్వేల్): మద్యం మత్తులో కిందపడి డీహైడ్రేషన్‌కు లోనై ఓ వ్యక్తి మృతి చెందాడు. ములుగు ఎస్ఐ రంగకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. క్షీరసాగర్ గ్రామానికి చెందిన ఎడ్ల నర్సింగరావు(30)వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. శుక్రవారం రాత్రి 9 గంటలకు పొలానికని బయలుదేరాడు. కానీ పొలానికి వెళ్లకుండా వంటిమామిడి గ్రామం వద్ద ఆహారం తీసుకోకుండా మద్యం సేవించాడు. మత్తులో సమీపంలోని నర్సరీ వద్ద కింద పడిపోయి మృతి చెందాడు. శనివారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీహైడ్రేషన్ కారణంగానే నర్సింగరావు మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా...


పోచయ్య (ఫైల్)

కొడిపల్లి(నర్సాపూర్): సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. కొడిపల్లి ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని తిమ్మాపూర్‌కు చెందిన నీరుడి పోచయ్య(49) శుక్రవారం సాయంత్రం బయటకు నుంచి ఇంటికి వచ్చాడు. అప్పటికే మద్యంమత్తులో ఉన్నాడు. ఈక్రమంలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా కరెంట్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. దీంతో బాధితుడి కుటుంబసభ్యులు 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ పరీక్షించిన డాక్టర్ అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుని భార్య కంసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబరాన్నంటిన ఉత్సవాలు

- మైత్రి శివోత్సవంలో మంత్రి తలసాని
- చిట్కుల్‌లో బండ ప్రకాశ్

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో శివరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటాయి. పటాన్‌చెరు పట్టణ కేంద్రంలోని మైత్రి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవ జాగరణ కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకునేలా సాగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ గాయకులు వందేమాతరం శ్రీనివాస్, ఎస్పీ చరణ్, సునీత, టీవీ యాంకర్ సుమ, బిత్తిరి సత్తి పాల్గొని భక్తులను అలరింప చేశారు. మైత్రి గ్రౌండ్స్ అంతటా శివనామస్మరణతో మార్మోగింది. ఆధ్యాతికత వాతవారణం ఏర్పడింది. నియోజకవర్గ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మైత్రికి తరలివచ్చారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

చిట్కుల్‌లో..

పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడకు దగ్గరలోని చిట్కుల్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో కొనసాగిన శివరాత్రి ఉత్సవానికి శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలం మధు సేవలను కొనియాడారు. పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. చిట్కుల్ జాగరణ ఉత్సవాలు శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి.


జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌యాదవ్


పటాన్‌చెరు: పట్టణంలోని మైత్రి గ్రౌండ్స్‌లో జరిగిన జాగరణలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, క్రాంతికిరణ్ తదితరులు, శాసనమండలి మాజీ ప్రొటెమ్ స్పీకర్ భూపాల్‌రెడ్డి తదితరులు


శివరాత్రి వేడుకల్లో శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు


చిట్కుల్‌లో జరిగిన శివరాత్రి ఉత్సవాలకు హాజరైన ప్రజలు